# తిరస్కృత వాఙ్మయం

కాఫీ త్రాగి జాగ్రఫీ సాక్షిగా, ఈలోకాన్ని జిరాఫీ మెడతో కలయచూచి వారి వీరి బయోగ్రఫీల ఫీలయి అదోయిదో ఏదో వ్రాద్దామని నిర్ణయించుకొన్న నన్ను అనుభవాల భవనాలలో పచార్లు కొడుతున్న మనస్సు "ఓరీ కుర్రా ఎ-ఎ-ఎడిటర్లు తి-తి-తిప్పేస్తారురా!" అంది. అవును—ఈ పత్రికా సంపాదకులకి మనం ఎన్ని గాలన్ల కాఫీ, సిగరెట్టు పెట్టెలూ, కిళ్లీలూ త్రాగి, కాల్చి, నమిలి, వ్రాసి, గీసి పంపుతున్నామో తెలియక అలా చూసి యిలా తీసి పారేస్తున్నారు. యింతటి శ్రమ ఒక్క మంచి పజిలుకై పడితే అదృష్టం కోడై కూశేది కదా! మనస్సు చెప్పింది ఖనిజంవంటి నిజం. 'ఎడిటర్లు తిప్పేస్తారు' అందుకు మనం ఎడిటర్లను మోసం ఎందుకు చెయ్యకూడదు? మనం వ్రాసినవి తిప్పేసి ఎవడో కొన్‌కిస్కాగాడు వ్రాసిన కాకమ్మ-పిచికమ్మ కథ సీరియల్‌గా ప్రచురిస్తారే? యిహ స్పేర్ చేస్తే లాభం లేదు అనుకొన్నా. "ఏం చేస్తావు? కుర్రా" అంది మనస్సు. "దేఖో" అన్నా. చేతినరాలతో మనస్సుని బంధించి, వేళ్ళతో కలాన్ని పట్టి బుర్రలోని ఆలోచనల గాసు (gas) కాగితంపై వదలసాగా. రచన హెడ్డింగు "లాప్పాలాండు ప్రజాకవి బ్రూక్‌లాక్స్ జీవితం" అన్నా. మూలం "పెట్రో మాక్స్" పక్కన అనువాదకుడు నేను. అది యిదికలిసి ఏదో వ్రాసేసి "బ్రూక్‌లాక్స్" జీవిత చరిత్రా అతని ప్రియురాలు "లాంపు" అతని వ్రాతలు. ఏవోకోతలు కసకసా, కోసేసా, కాదు వ్రాసేసా. మరునాడు టపాలో ఒక కుర్రపత్రికకి పంపించి గడియారంవంక అలా చూస్తుండగానే వారం గిరగిరా తిరిగింది. నేను రచనపంపిన కుర్రపత్రిక రానూవచ్చింది అందులో 'బ్రూక్‌లాక్స్' జీవిత చరిత్ర అంతా చచ్చు అచ్చు పొరబాటుయినా లేకుండాపడింది. "ఓహో ఈ పత్రిక కొత్తవిషయాలు ముద్రిస్తోందే" అని చదివినవారు విన్నవారు అన్నారు.

రాత్రి నాలో నేను నవ్వుకొంటూ శెభాష్ అనుకొంటూ పడుకొన్నా. పిల్లాడు ఏడుస్తున్నాడు పాలకి గావును! అర్ధాంగి నిద్రలో వీపువెనుక పిల్లాడు ఏడుస్తుంటే వదలని మత్తులో యిటు మంచం పట్టీని "జో-జో" అంటూ జోకొడుతోంది. అవును కుర్ర ఎడిటరు నన్నువదలి బ్రూక్‌లేక్స్‌కి ప్రాముఖ్యం ఇచ్చాడు. "హా, హా" అని గట్టిగా నవ్వాలేమో "ఒరేయి కుర్రా సిగ్గులేక నవ్వుతావేం - నీ పేరునపంపిన వందల రచనలు పసలేక తిరిగివస్తే దొడ్డిదారిని వెళ్ళి గడ్డితిని అయినా పేరులేక వాజమ్మలాచీకట్లో అఘోరిస్తూ నవ్వుతావేంరా - పోయి ఒక అరకప్పు కాఫీ త్రాగి మరీ ఏడు" అంది మనస్సు. అయితే యింతేనా? అన్నా "పోనీ ఒక పత్రికపెట్టి దివాలాతీయి రచనవస్తుంది" అంది మనస్సు వెక్కిరిస్తూ. "ఛా పాడుమనస్సు. వెక్కిరిస్తోంది" ముందుకొంచెం విచారించటానికి శక్తికావాలి. శక్తి అంటే కాఫీత్రాగాలి అనుకొంటూ చీకట్లో హోటలు రోడ్డు పుచ్చుకొన్నా, ఏం చెయ్యను? నా కిష్టమైన రచనా కార్యక్రమాన్ని కాశీలో వదలినట్లు మరచిపోయా.

వెల్లంకి సుబ్బారావు